తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ గురువారం 8-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 276 పేజీలు 8 వెల: రూ.1/-

## కైరోలో కారుబాంబుతో పేలుళ్లు
## 20 మంది దుర్మరణం

కైరో,ఆగస్ట్7(ఆర్ఎన్ఎ): ఈజిప్ట్‌లోని సెంట్రల్ కైరోలో బుధవారం ఉదయం ఆత్మాహుతి దాడి జరిగింది. క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో బాంబులతో ఉన్న కారు వాహనాలను ఢీకొనడంతో భారీగా పేలుళ్లు సంభవించాయి. ఈ దాడుల్లో 20 మంది మృతి చెందగా 47 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కారు నిండా బాంబులు పెట్టుకొని రద్దీ ప్రాంతంలో మరో మూడు వాహనాలను ఢీకొనడంతో భారీగా పేలుడు సంభవించిందని పోలీసులు తెలిపారు. ఈ దాడికి పాల్పడింది తామేనని ఇస్లామిస్ట్ బ్రదర్ హుడ్ అనే తీవ్రవాద సంస్థ తెలిపింది. ఈ దాడిలో చనిపోయిన మృతుల పట్ల ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దల్ ఫత్తా అల్ సిసి సంతాపం వ్యక్తం చేశారు.







భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి రాజ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ

# చిన్నమ్మకు నేతల ఘన నివాళి

**- దేశానికి సుష్మా సేవలను స్మరించుకున్న నేతలు**
**- కన్నీటి పర్యాంతమైన ప్రధాని మోదీ**
**- నివాళులర్పించిన ప్రధాని మోదీ, అద్వాణీ, వెంకయ్య ఇతర నేతలు**
**- ఆమె మరణం బీజేపీకి తీరని లోటన్న ప్రముఖులు**
**- దేశవ్యాప్తంగా చిన్నమ్మకు ప్రజల నివాళి**

న్యూఢిల్లీ,ఆగస్టు7 (ఆర్ ఎన్ఎ): భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ పార్థీవ దేహానికి రాజకీయ ప్రముఖులు, దేశ ప్రజలు నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను, బీజేపీ పార్టీ బలోపేతానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యాంతమయ్యారు. సుష్మా పార్థీవ దేహాన్ని బుధవారం తన నివాసం నుంచి ప్రజలు, నాయకులు సందర్శనార్థం బీజేపా ప్రధాన కార్యాలయంలో ఉంచారు. కాగా ఆమె పార్థీవ దేహాన్ని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ ప్రముఖ నేతలు సందర్శించి నివాళులర్పించారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా సుష్మాకు ఘన నివాళి అర్పించేందుకు బీజేపీ కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో బీజేపీ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి, పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమె తీవ్ర గుండెపోటుకు గురైన మంగళవారం రాత్రి హఠాన్మరణం చెందారు. 67 ఏళ్ల సుష్మాకు మంగళవారం రాత్రి 10.15 గంటల సమయంలో గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)కు తరలించారు. ఆ వెంటనే ఎమ్జర్జెన్సీ వార్డుకు మార్చారు. చికిత్స అందిస్తుండగానే ఆమె తుదిశ్వాస విడిచారు. సుష్మా స్వరాజ్ అస్వస్థతకు గురయ్యారని తెలియగానే పలువురు కేంద్ర మంత్రులు హుటాహుటిన ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఆమె మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుష్మా ఆకస్మిక మరణ వార్త భాజపా నేతలు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమెకు 2016లో మూత్రపిండ మార్పిడి జరిగింది. అనారోగ్య కారణాల రీత్యా ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. ఆమెకు భర్త స్వరాజ్ కౌశల్, కుమార్తె బన్సురి ఉన్నారు.

మధ్యాహ్నం 3గంటలకు ప్రభుత్వ లాంచనాలతో సుష్మ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

### సుష్మాకు రాజ్యసభ ఘన నివాళి..

కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ మృతిపట్ల రాజ్యసభ సంతాపం ప్రకటించింది. బుధవారం ఉదయం సభ ప్రారంభంకాగానే సుష్మా మృతిపట్ల రెండు నిమిషాల పాటు సభ్యులు మౌనం పాటించారు. 'సుష్మా స్వరాజ్ ఆకస్మికంగా మరణించడం బాధాకరమని, ఆమె మరణం తనతో పాటు దేశ రాజకీయాల్లో తీరని లోటని, ఉత్తమ పార్లమెంటేరియన్, సమర్థవంతమైన పరిపాలకురాలు, ప్రజావాణిని గట్టిగా వినిపించే నేత సుష్మా అని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కొనియాడారు

### ప్రముఖుల ఘన నివాళి..

సుష్మా స్వరాజ్య పార్థీవ దేహాన్ని ప్రజలు, బీజేపీ కార్యకర్తల సందర్శనార్థం బీజేపీ ప్రధాన కార్యాలయం ఉంచారు. రాష్ట్రపతి రాజ్‌నాథ్ కోవిద్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొద్దిసేపు పార్థీవదేహం వద్దనే ఉన్న ప్రధాని మోదీ.. కన్నీటి పర్యాంతమయ్యారు. సుష్మా స్వరాజ్ మరణం తనని తీవ్రంగా కలచివేసిందని భాజపా కురువృద్ధుడు ఎల్.కె.అద్వాణీ అన్నారు. బుధవారం ఉదయం ఆమె మృతదేహానికి నివాళులర్పిస్తూ.. కన్నీరు పెట్టుకున్నారు. సుష్మా స్వరాజ్, అద్వాణీలది ప్రత్యేక అనుబంధం. రాజకీయాల్లో తనకు అద్వాణీ మార్గనిర్దేశకులని అనేక సందర్భాల్లో సుష్మా చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె మరణం ఆయన్ని తీవ్రంగా కలచివేసింది. పార్టీ పురుడు పోసుకున్న నాటి నుంచి పనిచేసిన వ్యక్తుల్లో ఆమె ఒకరని అద్వాణీ గుర్తుచేసుకున్నారు. పార్టీ ప్రారంభించిన నాటి నుంచి పనిచేసి.. స్వయంకృషితో గొప్ప నేతగా ఎదిగిన వ్యక్తి ఆమె. అనేక మంది మహిళా నేతలకు ఆమె ఆదర్శం. గొప్ప వక్త. ఆమె జ్ఞాపకశక్తిని చూసి నేను అనేక సార్లు ఆశ్చర్య పోయేవాణ్ని అని, అనేక ఘటనల్ని అత్యంత స్పష్టతతో, కచ్చితత్వంతో గుర్తుచేసేవారని కొనియాడారు. గొప్ప మానవతావాది. తన సహజశైలితో ప్రతి ఒక్కరి మనసుల్ని గెలుచుకున్నారన్నారు. ప్రతి సంవత్సరం నా జన్మదినం రోజు నాకిష్టమైన చాకొలెట్ కేక్ తీసుకొచ్చేవారని, అలా తీసుకురావడం మరచిపోయినట్లు నాకు ఒక్క ఘటన కూడా గుర్తులేదంటూ సుష్మాజీతో ఉన్న అనుబంధాన్ని అద్వాణీ గుర్తుచేసు కున్నారు.

### కంటతడి పెట్టుకున్న ప్రధానమంత్రి మోడీ...

కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ భౌతిక కాయానికి ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శి ంచారు. వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా మోడీ భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడి పెట్టారు. ఉబికి వస్తున్న బాధను అదిమిపడుతూ గంభీరంగా ఉండేందుకు ప్రయత్నిం చినా, ఆయన కంటి వెంట నీరు ఆగలేదు. సుష్మాస్వరాజ్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని మోడీ కన్నీటి పర్యంతం అయ్యారు.

### మాటిచ్చి.. నెరవేర్చకుండానే వెళ్లిపోయావా దీదీ - ఇరానీ

కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ హఠాన్మరణం పట్ల కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సుష్మను ప్రేమగా దీదీ అని పిలిచే స్మృతి.. ట్విటర్ వేదికగా ఉద్విగ్నభరిత సందేశాన్ని పోస్టు చేశారు. నాకు నీతో గొడవ పెట్టుకోవాలని ఉంది దీదీ(సుష్మను ఉద్దేశిస్తూ). బన్సూరీ(సుష్మ కుమార్తె) తో కలిసి నన్ను రెస్టరెంట్‌కు తీసుకెళ్తానని మాటిచ్చావు. ఆ ప్రామిస్‌ను నెరవేర్చకుండానే నువ్వు వెళ్లిపోయావు అని స్మృతి ఇరానీ ట్వీట్ చేశారు.

### కంటతడిపెట్టిన కిషన్‌రెడ్డి ..

భాజపా సీనియర్‌నేత సుష్మా స్వరాజ్ పార్థీవదేహాన్ని చూసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కంటతడిపెట్టారు. సుష్మాస్వరాజ్ ఇక లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోలేపోతున్నట్లు ఉద్వేగానికి గురయ్యారు. 'సుష్మాజీ నాకే కాదు.. యావత్తు తెలంగాణకు చిన్నమ్మే. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి రాష్ట్రం వచ్చేలా చేసిన ఆమె కృషిని ఎన్నటికీ మరువలేము. ప్రజా సమస్యలపై ఆమె స్పందించే తీరు మాలాంటి వారికి స్ఫూర్తి. సుష్మాస్వరాజ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకొంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

### అద్భుతమైన పార్లమెంటేరియన్‌ను కోల్పోయాం - మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్

కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నేత సుష్మాస్వరాజ్ హఠాన్మరణం పట్ల మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రాజకీయ చరిత్రలో సుష్మ తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెతో కలిసి పనిచేసిన క్షణాలను గుర్తుచేసుకున్నారు.

'స్వతంత్ర భారత రాజకీయ చరిత్రలోని ప్రముఖ మహిళా నాయకురాళ్లలో సుష్మాస్వరాజ్ ఒకరని, తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు, బాధ్యతలు చేపట్టిన సుష్మ.. అన్నింటిలోనూ తనదైన ముద్ర వేశారన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వంలో ఆమెతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించిందని, క్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో సుష్మ నాకు అండగా నిలిచారని విద్యాసాగర్‌రావు గుర్తుచేసుకున్నారు. ఆమె బలమైన నాయకురాలు. ఎంతో గొప్పగా మాట్లాడటం ఆమెకు దేవుడిచ్చిన వరమని, తెలంగాణలో ఆమె ఎన్నో ప్రసంగాలు చేశారని, ఆ ప్రసంగాలను నేను అనువాదం చేయడం గర్వంగా భావిస్తున్నానని అన్నారు. నేడు భరతజాతి ఓ అద్భుతమైన పార్లమెంటేరియన్‌ను, ఛరిష్మా ఉన్న నాయకురాలిని కోల్పోయిందని విద్యాసాగర్ రావు సంతాపం తెలియజేశారు.

### ఒక్క రూపాయికోసం రమ్మన్నారు. కానీ, అంతలోనే - హరీశ్ సాల్వే

కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్‌తో ఉన్న అనుబంధాన్ని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే గుర్తు చేసుకున్నారు. పాకిస్థాన్ అదుపులో ఉన్న భారతీయుడు కుల్‌భూషణ్ జాదవ్ కేసును అ ం త ం ా జ తీ య ం న్యాయస్థానం(ఐసీజే)లో హరీశ్ వాదించారు. సుష్మా విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడే సాల్వే ఈ కేసు బాధ్యతను తీసుకున్న విషయం తెలిసిందే. సాధారణంగా ఆయన కోర్టుకు వస్తే రూ.6 లక్షల నుంచి రూ.15లక్షలు తీసుకుంటారు. కానీ, జాదవ్ కేసు వాదించేందుకు ఆయన తీసుకుంది కేవలం ఒక రూపాయి మాత్రమే. ఇటీవల ఐసీజేలో జాదవ్ తరఫున కేసు వాదించి భారత్‌కు చిరస్మరణీయ విజయం అందించారు కూడా. సుష్మా స్వరాజ్ చనిపోవడానికి గంట ముందు తనతో మాట్లాడారని, ఇరువురి మధ్య సంభాషణ భావోద్వేగంగా సాగిందని సాల్వే తెలిపారు. ఆమెతో రాత్రి 8:50 గంటల సమయంలో మాట్లాడాను. మా ఇద్దరి మధ్య సంభాషణ చాలా ఉద్వేగంగా సాగిందని, మా ఇంటికొచ్చి ఓ సారి నన్ను కలవండి అని సుష్మా నన్ను అడిగారన్నారు. మీరు జాదవ్ కేసు గెలిచారు కదా.. అందుకు నేను ఒక్క రూపాయి ఫీజు ఇవ్వాల్సి ఉందని ఆమె అన్నారని, దానికి బదులిస్తూ.. 'అవును నేను మీ ఇంటికొచ్చి ఆ విలువైన రూపాయిని తీసుకోవల్సిం దేనని చెప్పాను.. ఐతే, రేపు 6 గంటలకు వచ్చి నన్ను కలవండి అని సుష్మ తనతో చెప్పారని ఈ సందర్భంగా సాల్వే నిన్న జరిగిన సంభాషణను గుర్తుచేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు.

### ప్రజల గుండెచప్పుడు 'చిన్నమ్మ' - కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

ప్రజా ఉద్యమంగా మారిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి భాజపా జాతీయ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ చేసిన కృషి వెలకట్టలేనివని కరీంనగర్ భాజపా ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన సుష్మా స్వరాజ్ మంగళవారం రాత్రి కన్నుమూయడంతో... తమ ఆత్మీయురాలిని పోగొట్టుకున్నామన్న బాధ ప్రతి తెలంగాణ పౌరుడు మదిలో ఉందన్నారు. సామాన్య తెలంగాణ పౌరుడి మనోవేదనను ప్రత్యేక రాష్ట్ర సాధన దిశగా మలిచిన ధన్యురాలు సుష్మా స్వరాజ్ అని బండి సంజయ్ పేర్కొన్నారు. తమ ఇంటి ఆడపడుచు మరణం తీరనిదని, తెలంగాణ రాష్ట్రానికి గవర్నర్గా వస్తుందన్న ఎదురుచూపులకు భాగ్యం లేకుండా పోయిందని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సుష్మా స్వరాజ్ మృతి పట్ల బండి సంజయ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ ఆమె అనుసరించిన సైద్ధాంతిక ఆలోచనా ధోరణిలో తెలంగాణ ప్రజలు పయనించడమే ఆమెకు తెలంగాణ ప్రజలు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు.

## సిరిసిల్ల జిల్లా కార్మిక ధార్మిక క్షేత్రం : కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 7 (నేటినిజం ప్రతినిధి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ పర్యటించారు. పర్యటనలో భాగంగా సిరిసిల్ల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఆ తర్వాత జిల్లా పరిషత్ తొలి సర్వసభ్య సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. సిరిసిల్ల జిల్లా కార్మిక ధార్మిక క్షేత్రం అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులందరూ ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలి. సిరిసిల్ల జిల్లాకు అద్భుతమైన, అపురూపమైన అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే ఈ ప్రాంతం గోదావరి జలలాతో సస్యశ్యామలం అవుతుంది. జిల్లా పరిమాణం చిన్నగా ఉన్నప్పటికీ ప్రజల సౌలభ్యం కోసమే కొత్త జిల్లాల ఏర్పాటు. కేసీఆర్ వల్లే 4 వేల తండాలు గ్రామపంచాయతీలుగా ఆవిర్భవించాయి. జిల్లాలు చిన్నగా ఉంటే ప్రజలకు సంక్షేమ ఫలాలు వేగంగా పారదర్శకంగా అందుతాయి. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరం సమిష్టిగా పని చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాం. పంచాయతీరాజ్ చట్టం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో జవాబుదారీతనంపై ఎక్కువగా దృష్టి పెట్టారు. అధికారులతో పని చేయించుకోవాలంటే చట్టంపై అవగాహన ఉండాలి. విధులు, బాధ్యతలు తెలుసుకోకపోవడం వల్లే గొడవలు వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రమేశ్ బాబు, సుంకే రవిశంకర్, రసమయి బాలకిషన్, జడ్పీ ఛైర్‌పర్సన్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ స్థానానికి గుత్తా సుఖేందర్ రెడ్డి నామినేషన్



హైదరాబాద్, ఆగష్టు 7: తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఇవాళ నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాన్ని అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డితో పాటు నల్లగొండ జిల్లాకు చెందిన టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటా కింద 2015లో టీఆర్ఎస్ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికైన కే యాదవరెడ్డి.. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ ఫిరాయించడంతో టీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు శాసనమండలి ఛైర్మన్ అనర్హత వేటువేశారు. దీంతో యాదవరెడ్డి హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ అనర్హత వేటు సరైనదేనని తీర్పువచ్చింది.

ఈ ఎమ్మెల్సీ స్థానానికి 2021 జూన్ 3 వరకు పదవీకాలం ఉన్నది. ఉపఎన్నిక అనివార్యం కావడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 1వ తేదీన షెడ్యూల్‌ను ప్రకటించింది. 7వ తేదీ నుంచి 14 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 16న నామినేషన్ల పరిశీలన, 19న ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటిస్తారు. ఏకగ్రీవం కాకుంటే 26న ఎన్నిక నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం ఓట్లను లెక్కిస్తారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాలను పరిశీలిస్తే ఈ ఎన్నికలో టీఆర్ఎస్ ఏకగ్రీవంగా ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకోవడం ఖాయంగా కనిపిస్తున్నది.

## చరిత్రలో నేటినిజం



తే॥ శ్రీయుత విద్యారణ్యుల
శ్రేయోరాజ్యము నిలుపగ చేసిన కౌశికిసన్
ధీయుతుల ఫలముని దలచెద
రాయుల పట్టాభిషేక రమ్య దినంబున్ !!

( ఆగష్టు 8 శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేకం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

## కాబూల్‌లో బాంబు పేలుడు

**•95 మందికి గాయాలు**
**•దాడికి బాధ్యులం తామేనని ప్రకటించిన తాలిబన్లు**

ఆఫ్ఘనిస్తాన్, ఆగస్టు7(ఆర్ఎన్ఎ) : ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ లో బాంబు పేలుడుతో దద్దరిల్లింది. కాబూల్ లోని హెడ్ క్వార్టర్ వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు రక్షించుకోవడానికి పరుగులు తీశారు. ఈ ఘటనలో 95 మందికిపైగా గాయాలపాలయ్యారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. బాంబుదాడిలో గాయపడిన వారిలో సాధారణ పౌరులే ఎక్కువగా ఉన్నారని తెలుస్తోంది. పోలీసులే లక్ష్యంగా ఉగ్రవాదులు బాంబు పేలుడుకు పాల్పడ్డారని తెలుస్తోంది. ఈ దాడికి తామే బాధ్యులమని తాలిబన్లు ప్రకటించారు. ఓ వ్యక్తి బాంబులు అమర్చుకుని తనకు తాను పేల్చుకున్నాడని వెల్లడించింది. హెడ్ క్వార్టర్ వద్ద రద్దీగా ఉన్న సమయంలో దాడి జరిగింది. ఆ ప్రాంతమంతా బీభత్సంగా తయారైంది. హాహాకారాలు మిన్నంటాయి. తమ వారు ఎలా ఉన్నారోనని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. 95 మందికి గాయాలయ్యాయని..ఇందులో సాధారణ పౌరులు, మహిళలు, చిన్నారులు ఉన్నారని ఆరోగ్య మంత్రి వెల్లడించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉగ్రవాదుల కోసం గాలింపులు పచేపట్టారు. కాగా గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని, వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

## అమ్మనే సర్వస్వం

నవమాసాలు మోసిన అమ్మ
ఎన్ని జన్మలైనా నీ రుణం తీరునా
కంటికి రెప్పల నన్ను పెంచిన అమ్మ
మీ త్యాగం చెప్పడం నా తరమా
నా ప్రాణం నువ్వు
నా రూపం నువ్వు
నువ్వు లేనిదే నేను లేను
ఎన్ని జన్మలైనా
నువ్వే నా ప్రాణం
నువ్వే నా లోకం



**- కయ్యాల శ్రావ్య**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూర్
నారాయణరావుపేట
సిద్దిపేట-502 276

## మంచి నాన్న

నాన్న అన్న పదం కన్న
గొప్పది ఏది లేదు
నాన్న పెంపకంలో కఠినత్వం
మన భవిష్యత్తుకు పునాది
నాన్న దేవుడి కన్న గొప్ప
నాన్న ఎల్లప్పుడు కష్టపడేది మన కోసం
ఉద్యోగం కోసం ఉదయాన్నే లేచి
ఇంటి పట్టున ఉండలేక కంటికి నిద్రలేక
మన కోసం కష్టపడే నాన్న
నీ రుణం ఎలా తీర్చుకోను?



**- మిద్దెసాయి**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## దైవ స్వరూపిణి

సృష్టికి జీవం పోసేది అమ్మ
మన ప్రేగు బంధం అమ్మ
మనను లాలించేది అమ్మ
మనకు తినిపించేది అమ్మ
అమ్మ మనకు దైవ స్వరూపం
అమ్మ లేనిది జీవితం లేదు
అమ్మ లేకపోతే మనం ఉండలేం
అమ్మనే సృష్టికి ఆరంభం.



**- రాగుల భవిత**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## అమ్మ ప్రేమ అమృతం

అమ్మ అనే పిలుపు అమృతం లాంటిది
మనవెన్నుండి ధైర్యం చెప్పేది అమ్మ
తన బిడ్డని చూసి ఆనందించేది అమ్మ
బిడ్డపై అనురాగం, ప్రేమను చూపేది అమ్మ
అనురాగంతో గోరుముద్దలు పెట్టేది అమ్మ
అమ్మ ప్రేమ అమోఘమైనది
అమ్మ మాటలు మధురమైనవి
ప్రతిరోజూ కనిపించే దేవత అమ్మ
అమ్మ ప్రేమ అజరామం
అమ్మ అంటే నాకెంతో ఇష్టం.



**- జి. సాయినాథ్**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## ఓ నాన్నా

నాన్నా ఓ నాన్నా
నీ ప్రేమ కావాలి నాన్నా
నీవు లేనిదే నేను లేను
నీవు నేర్పిన నడక
నా పయనానికి తొలి అడుగు
నీవు నేర్పిన విద్య
నా బతుకుకే వేదం
నీవు ఇచ్చిన ధైర్యం
నాకు కొండంత అండ.



**- ఎన్. పూజిత**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

# బాల వికాసం

**మహాకవి డా॥ దాశరథిగారి జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా జక్కాపూర్ ఉన్నత పాఠశాలలో "బాలకవి సమ్మేళనం" ప్రధానోపాధ్యాయులు ఆర్. పద్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు ఆసర్ల చెన్నకేశవులు, బొంతపల్లి దయానంద్ సరస్వతి వ్యవహరించారు. 25 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ బాలల కవితలు ఈ వారం నేటినిజం పాఠకుల కోసం..**

## ఆడవాళ్ళు

అనుబంధాలకు ఆనవాళ్ళు
మన పల్లెలు
ఆత్మీయత మమకారాలకు
పుట్టినిల్లు మన పల్లెలు
పచ్చని పంట పొలాలకు
నిలయాలు మన పల్లెలు
ఎంత స్థాయికి ఎదిగినా
ఎంత గొప్ప పని చేపట్టినా
తల్లి లాంటి పల్లెను
తప్పక గుర్తుంచుకో..

**- ఎస్.శ్రేయ**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## అనుబంధం

నాన్న నీ మనసు ఎంతో వెన్న
నీ ప్రేమ నాకు ఒక ఆయుధం
నీవు నాపై చూపిన ప్రేమ
తరగని సిరిసంపద
నీవు నాకు చూపిన మార్గం
నా జీవితం గమనానికి తొలి అడుగు
ఆకాశమంత అభిమానం
నీవు నాకిచ్చే బహుమతి
ఆకాశానికి భూమికి మధ్యదూరం
ఉంటుందేమోకాని
విడదీయలేని
అనుబంధం మనది.



**- గొడుగు వంశీ**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## డబ్బు

నోరు లేకుండానే మనతో పలికిస్తుంది
కళ్ళు లేకుండానే శాసిస్తుంది
చేతులు లేకుండానే ఆశిస్తుంది
కాళ్ళు లేకుండానే నడిపిస్తుంది
లేని మనుషులను దగ్గర చేస్తుంది
ఉన్న మనుషులను దూరం చేస్తుంది
డబ్బు ఒక విచిత్రం
దాని బారిన పడితే
మన బతుకు చిందర వందరం.

**- బి. శ్రావణి**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## జీవిత గ్రంథం

సృష్టికి మూల స్తంభం
ఆపదలలో ఆదుకునే స్నేహితుడు
బడిలో పూజలు అందుకునే దేవుడు
మన ఎదుగుదలకు సోపానం
తిట్టినా, కొట్టినా చేరదీసేవాడు గురువు
గురువే దైవం
గురువే ధైర్యం
గురువే మన జీవిత గ్రంథం.



**- ఎర్రం అంకిత్ రెడ్డి**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## ఆటలు జీవన పోరాటాలు

శారీరక వికాసాన్ని మెరుగుపరిచే
సరదాగా సాగే ఆటలు
మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే
మధురామృతాన్ని పంచే ఆటలు
గెలుపు ఓటములు గుణపాఠాలు
నిజజీవితంలో ఆటుపోటులు
ఐక్యతను సంఘటిత పరిచే
సహచరుల సమిష్టి కలయికలు
సుఖదుఃఖం మధుర సంగమం
క్రీడా వినోదాల చదరంగం
మన జీవితమే ఒక ఆటస్థలం
నిరంతరం గెలుపునకై అన్వేషణ
ఎదురయ్యే ప్రతి ఓటమి
రేపటి విజయానికి సోపానం
ఆటలు ఒక ఆనందం
ఆటలు ఒక పోరాటం
ఆటలు ఒక లక్ష్యం
గమ్యం చేరేంత వరకు
విశ్రమించని పయనం.



**- కరికే నితీష్ కుమార్**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## జీవిత పోరాటం

జీవితం ఒక పోరాటం
అంతులేని ఈ పోరాటంలో
అవమానాలు, నిందలు, కష్టాలు
ఎన్నో ఎదురౌతుంటాయి.

అయినా కృంగిపోకు మిత్రమా
కృంగిపోతే నువ్వేమి సాధించవు
లే.. లేచి నిన్ను నీవు
నిరూపించుకునే దానికి
ఇదే అవకాశం మిత్రమా
నీలో దాగి వున్న
ఆత్మ బలమెరిగి
ప్రయత్నించు మిత్రమా
నిన్ను నువ్వు బలపరుచుకో...
రాత్రి తర్వాత పగలుఎట్లా
అయితే వస్తుందో
కష్టం తర్వాత సుఖం వస్తుంది
భయపడకు మిత్రమా..
ఈ జీవన పోరాటంలో
అంతులేని ఆవేదన
నిరంతరం ఉంటూనే ఉంటాయి
సాగిపో.. సాగిపో.. సాగిపో
నువ్వొక శక్తివి
అనంత శక్తులు నీలోనే ఉన్నాయి
నువ్వు గెలుస్తావు.. గెలుస్తావు..

**- కర్రె రాఘవ**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## మా గురువులు

గురువు అంటే గుడిలో దేవుడు
విజ్ఞానం అనే వెలుగును వెలిగించే భానుడు
ఏదైనా తప్పు చేస్తే
చల్లని మాటలతో
సరిదిద్దే చక్కని చంద్రులు
మట్టి లాంటి మనల్ని
మని మాణిక్యాలుగా చేసేవారు
ఆపదలో ఆదుకునే స్నేహితులు
చీకటిలో వెలుగునిచ్చేవారు
వీరే మా గురువులు.

**- కోడి. రాజష్**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## మా బడి

మా బడి-అమ్మ ఒడి
మా గురువులే మాకు దేవుళ్ళు
మేమే వారికి భక్తులం
విద్యార్థికి చదువు అవసరం
చదువుకి గురువు అవసరం
బడి యొక్క గొప్పతనాన్ని తెలుసుకో
నిన్ను నీవు నిరూపించుకో
తేనెటీగకి తేనే అవసరం
విద్యార్థికి చదువు అవసరం.



**- బోల్ల వందన**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## దీపావళి

చిచ్చుబుడ్డీల చిటపటలు
టపాకాయల టపటపలు
కాకరపుల్లల కాంతులతో
దివ్య వెలుగుల దీపావళి
గడిచిన చేదు జ్ఞాపకాలను వీడండి
బంగారు భవిష్యత్తుకి స్వాగతం పలికి
దివ్య జ్యోతులను వెలిగిద్దాం.



**- రాగుల చంద్రలేఖ**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## పర్యావరణ పండుగ

ప్రకృతి అనేది
దేవుడు ఇచ్చిన వరం
పర్యావరణాన్ని కాపాడుదాం
దీపావళిని దీపాలతో ఆరాదిద్దాం
వెలుగును పంచుదాం
టపాసులు వద్దు
పచ్చదనం ముద్దు
గాంధీజీ బాటలో నడుద్దాం.
దీపావళిని పర్యావరణ
పండుగగా భావిద్దాం.



**- తోకల కావ్య**
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276

## నేర్చుకో

బడి మన దేవాలయం
గురువు మన పూజారి
గుడిలో మంచి నేర్చుకో
బడిలో లక్షణాలు నేర్చుకో
గుడిలో, పూజారి అర్చనలే
దేవుడి ఆశిస్సులు
గుడిలో దేవుడి దీవెనెలు
బడిలో గురువు చెప్పె బోధనలు.

– తోకల కావ్య
10వ తరగతి
జి.ప.ఉ.పా. జక్కాపూరు
నారాయణరావు పేట్
సిద్దిపేట-502 276



## సంక్రాంతి

భాగ్యాలను పంచే భోగి పంటలు
సంక్రాంతి లక్ష్మీ, ఆనందాలను, ఆత్మీయలను
సరదాలను సంతోషాలను, ముంగిట పరిచే
కనుమ, సంక్రాంతి పండుగ
భోగి మంటల వెలుగులో మీరు ఎల్లప్పుడూ
సకల భాగ్యాలతో తులతూగాలని
కోరుకుంటూ మీకు భోగి పండుగ
సంతోషాల సంక్రాంతి రైతన్నల గుండెలల్లో
నింపుతావు ఆనందాల కాంతి సరదాలు
సంతోషాలు ముంగిట్లో ఆనందాలు



**-పి. జయంత్**
10వ తరగతి, జి.ప.ఉ.పా.
జక్కాపూరు
నారాయణరావు పేట్,
సిద్దిపేట-502 276

## కడారు మనో గీతికలు

తెల్లవారక ముందే
నిద్రలేవడం పల్లె సంస్కృతి!
నిద్రలేస్తేనే తెల్లవారడం
పట్టణాలకు పట్టిన గతి!

నిజాయితీ అంటే నిటారుగా నిల్చోవడం
కష్టనష్టాలకు తట్టుకోవడం!
కప్పులో టీ ఉంటేనే కదా
తుఫాను తాకిడికి వెరవడం!

కలిసి పంచుకుంటే
కరిగిపోతాయి కష్టాలు!
కలకాలం కలిసి వుంటే
రెట్టింపవుతాయి సుఖాలు!

గుమ్మడికాయ కొండంత ఉంటేనేమి
కత్తిపీట ముందు దాని లెక్కెంత
గాలి తిత్తి ఆకాశమంత ఉంటేనేమి
గుండుసూదికి లోకువే కదా!

కొండంత మనిషికి
పిడికెడంత గుండెకాయ!
కుతికె బడిందంటే
గొంతులో ఎలక్కాయ!!

కష్టతరం శ్రమ జీవితం
సులభతరం అక్రమ సంపాదనం
ఆటవిడుపు కాదు నిజ జీవితం
ఆకళింపు చేసుకుంటే అమృతం!

అధికారం ఓ మాయాజాలం
ఒకప్పుడు 'ఇషారా'తో పని!
ఇప్పుడు సీను మారింది
'హొషియార్' తోనే పని!

కడుపు నిండిన పులికి
రేపటి వేట గురించి తెలియదు!
అమాయకపు జింకకు
తన ఆయువెంతో తెలియదు!

తుంచినా, తుంచక పోయినా పువ్వు
కొంత కాలానికి వాడిపోవాల్సిందే!
వాడినా, వాడకపోయినా
యవ్వనమూ అంతే!

ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులు
అస్తిపంజరానికి అలంకరణ దుస్తులు!
రెక్కాడినా డొక్క నిండని విధానాలు
యంత్రాంగం రూపొందించిన
అందమైన నినాదాలు



**-కడారు వీరారెడ్డి**
సెల్: 9392447007

## మువ్వన్నెల జెండా

తెల్లవార్లూ కురిసిన
వానలో
స్నానం చేసి
శుభ్రమైన
తెల్ల చీర కట్టుకుని
భాసిస్తున్న
నేలతల్లి
ఆకసానికి
కాషాయం పులుముతూ
వేంచేసిన
గోరు వెచ్చని సూరీడు !
పచ్చదనం
సింగారించు కుంటున్న
వరి నాట్ల
సయ్యాటలు ..
కాషాయం..
ఆకుపచ్చ వర్ణాల
రెండంచుల
తెల్ల చీర కట్టుకున్న
ప్రకృతిమాత ..
నా దేశపు
మువ్వన్నెల జెండాలా
భాసిస్తోంది!



**-రాజశ్రీ కేతవరపు**
+91 8500-121990



## తలఎత్తి ఎగిరింది మన జండా

ఆకాశంలో విహంగమై
స్వాతంత్ర్య చిహ్నమై
రెపరెపలాడుతూ ఎగురుతోంది
మువ్వన్నెల జండా మనది
త్యాగం,శాంతి,సౌభాగ్యాలే
గుర్రాలై పరుగెడుతుంటే
ధర్మచక్రమే మనపాలనా రథచక్రాలై,
ముందుకు సాగిపోతుంటే,
ప్రజాస్వామ్యమే
మన సిద్ధాంతంగా
చట్టాలు చేస్తూ పోతుంటే
దేశం శరవేగంతో ముందుకు సాగుతోంది
తన లక్ష్యాలను చేరుకుంటోంది
బానిస సంకెళ్ళు త్రెంచుకుని
పరపాలన చీకటిని అంతంచేసి
ప్రచండ సూర్యునిలా
వెలిగే స్వరాజ్యమే సాధించాము
భాషలు వేరైనా
రంగు,రూపు వేరైనా
మన మందరము ఒకటేనని
ఆనాడు పోరాడాము
అదే భారతీయతను ఈనాడు, అడుగడున
ప్రమిదల్లా వెలిగించి
దేశ పురోభివృద్ధి పథంలో
రాకెట్ లా దూసుకు పోవాలంటే,
క్రమశిక్షణ తో సైనికులై అడుగేద్దాం
శ్రమించి, చెమటోడ్చి
ఇటుక పై ఇటుక జోడించి
నవభారతదేశం నిర్మిద్దాం
ప్రపంచానికే మార్గదర్శిగా
మనం దేశాన్ని నడిపిద్దాం



**-ఎస్.ఎమ్ .షరీఫ్**
9618045319

## నిజ భారతం

భరతకేతనం ఎగిరింది హిమగిరి శిఖరాన
త్రివర్ణ పతాక పాడింది జనగణమన కాశ్మీరాన
ఉండీలేదను భావనవీడి నిండు దేశమే మురిసింది
కన్యాకుమారికి కాశ్మీరానికి అవిరళ మార్గం వెలిసింది
వందే మాతరం సుజలాం సుఫలాం మలయజశీతలాం

పొరుగు దేశపు పొగరణిగేలా ప్రభుత సత్తా చాటింది
ఉగ్రమూకల కలచెదిరేలా సింహ గర్జనే చేసింది
గజగజ వణికే భూతలస్వర్గం సహజాకృతినే పొందింది
స్వాతంత్ర్యానికి సరియగు అర్థం దేశమంతటికి తెలిసింది
సారే జహాఁసె అచ్ఛా హిందూస్తా హమార హమారా

తెగువకు ఎగువన ప్రాణాలొడ్డే వీరజవానులు
కంటికి రెప్పగ నిజ సరిహద్దును కాచే సైనికులు
నౌకా వాయు పదాదిదళముల యుద్ధ యోధులు
జగతే మెచ్చగ జనతను నడిపే పాలకవర్యులు
జయజయజయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి



**-గొల్లపెల్లి రాంకిషన్**
9849693324.

బాలల కోసం బాలగేయాలతో రచయిత్రి, కవయిత్రి వడ్డేపల్లి సంధ్య వెలువరించిన "చిటపట చినుకులు" పుస్తకంలోని గేయాలు ఇవి.



## మా బడి

మాకిష్టం, మాకెంతో ఇష్టం
మాబడి అంటే మాకిష్టం
గుడిలో ఉండే దేవునివంటి
బడిలోని గురువులు ఇష్టం
ఆటలు ఆడుడు మాకిష్టం
పాటలు పాడుడు మాకిష్టం
ఆట పాటలతో నేర్పించేటి
బడి పాఠాలు మాకిష్టం
మంచిమాటలు మాకిష్టం
నీతి గాథలు మాకిష్టం
మానవత్వం పంచేటి
మనిషి తత్త్వం మాకిష్టం
భవితకు పునాదులేసి
భావి పౌరులుగా దిద్దేటి
మాబడి అంటె మాకిష్టం
మా గుడి అంటె మాకిష్టం.



## బతుకమ్మ

తెలంగాణ మెంతో
పులకించే నేడు
ఊరువాడ ఒక్కటై
ఆడిపాడె చూడు ॥బ॥
ఆశ్వీయుజ మాసం
వచ్చింది చూడు
బతుకమ్మ పండుగను
తెచ్చింది నేడు ॥బ॥
తంగేడు, గన్నేరు
గునకపూల తేరు
బతుకమ్మను పేర్చి
పూజలు చేసేరు ॥బ॥
ఆడిపాడి పూజించి
హారతులు ఇచ్చేరు
బంగారు బతుకమ్మ
తల్లిని కొలిచేరు ॥బ॥
పోయిరా బతుకమ్మ
పోయిరావమ్మ
మళ్ళొచ్చే యేడాది
మళ్ళీ రావమ్మా ॥బ॥

## బోనం



ఎల్లమ్మకు బోనాలు
బెల్ల బువ్వ సాకలు
పోషమ్మకు బోనాలు
కల్లుసాక మొక్కులు
పెద్దమ్మకు బోనాలు
పప్పన్నం నైవేద్యం
పోలేరమ్మ బోనాలు
పోతరాజు ఆటలు
గంగమ్మకు బోనాలు
గండదీప ధూపాలు
డప్పుల్ల దరువుల్లో
తీన్‌మార్ ఆటలు
ఆషాఢం బోనాలు
లష్కరు బోనాలు
తెలంగాణ తల్లికి
బంగారు బోనాలు.

## స్వచ్ఛ భారత్



బాలలం భావి పౌరులం
మేమే రేపటి వారసులం
పరిశుభ్రత పాటిస్తాం
పరిసరాలు రక్షిస్తాం
కరెంటు ఆదా చేసేస్తాం
లైటు, ఫ్యాను కట్టేస్తాం
నీటిని పొదుపు చేసేస్తాం
మేటిగ మేము నిలుస్తాం
కాలుష్యాన్ని అరికడుదాం
భూమితల్లిని కాపాడుతాం
స్వచ్ఛమైన మన భారతావనికి
సరిలేదంటూ చాటి చెబుతాం.

## చందమామ...



చందమామా వచ్చాడు
చల్లని వెన్నెల తెచ్చాడు
వెన్నెల్లోన మంచం వేసి
తాత ముచ్చట చెప్పాడు
ఒడిలో బజ్జోపెట్టుకుని
కథలను ఎన్నో చెప్పాడు
నాకు నిద్దుర వచ్చింది
కథ కంచికి చేరింది
కాళ్ళ నిండా పారాణి
నేనేమో మహారాణి.

## పరిశుభ్రత



పరిసరాలు చక్కగుంటె
ప్రగతిపథం అదేఅదే
ఊరు, వాడ బాగుంటే
సౌభాగ్యం అదేఅదే
పరిశుభ్రత పాటిస్తే
ఆరోగ్యం మనదే
చెత్తను తొలగించేస్తే
స్వర్గసీమ మనదే
ప్రతిఒక్కరు పదేపదే
ప్రతినపూని నిలవాలి
స్వచ్ఛతయే జండగా
కదంతొక్కి నడవాలి.

## సంక్రాంతి



సంక్రాంతి పండుగ
సరదాల పండుగ
ముగ్గులేసె పండుగ
ముద్దుగొలుపు పండుగ
ఆకాశంలో ఎగిరేటి
అందాల పతంగులు
ముంగిట్లో రంగులు
గడపల్లో గొబ్బిళ్ళు
పరమాన్నం పాయసాలు
నట్టింట్లో నవధాన్యాలు
గంగిరెద్దుల ఆటలు
హరిదాసు కీర్తనలు
బోసినవ్వు బాలలకు
బోగిపండ్ల మురిపాలు
ఆడపడుచులు అందరు
దీవెనలు ఇచ్చేరు.

## గాంధీతాత



బోసినవ్వుల మా తాతా
పిల్లల పాపల మా తాతా
వందనం అభివందనం
పిల్లల పాపల వందనం
సత్యం, ధర్మం, శాంతుల్ని
చాటి చెప్పగ నిలిచాడు
అహింస పరమోధర్మమని
అవని అంతటా చాటాడు
మానవులంతా ఒక్కటని
చాటి చెప్పి నిలిచాడు
కుల మతాలు లేవని
నేటి తరానికి చాటాడు
గాంధీతాతకు జైజైజై
గాంధీ మార్గం జైజైజై
బాపూజీకి జైజైజై
బాలల తాతకు జైజైజై.

## తొలకరి

తొలకరి జల్లులు కురిసాయి
బిరబిర వాగులు పారాయి
కుంటలు బిరబిర పొంగాయి
కాల్వలు నిండుగ పారాయి
చెరువులు పొంగి పొర్లాయి
పొలాలు, చేలు మురిసాయి
పచ్చదనానికి జలహారం
భూమితల్లికి సింగారం.



## అన్నదాత రైతన్న



ఆకాశంలో మెరుపు మెరియగ
చిటపటమంటూ వాన కురిసెను
మట్టి వాసన మదిని దోచగా
ఆనందంగా రైతు మురిసెను
నాగలి పట్టుకు పొలాని కెళ్ళి
భూమితల్లికి దండం పెట్టెను
ఎండా, వానలు లెక్కచేయక
పొలాలనన్నీ హలాల దున్నెను
పచ్చనిపంటతో భూమి నవ్వగా
ధాన్యరాసులతొ పల్లెలు వెలిగెను
బంజరులో బంగారం పండగ
ఉత్సాహంగా ఊరు మురిసెను.

## ఎవరు...?

ఎవరు నేర్పారు, మీకెవరు నేర్పారు
ఆటల్లు, పాటల్లు, అందాల మాటలు ॥ఎ॥
కమ్మని పాటల మన కోకిలమ్మకు
కూకూ గానాలు ఎవరు నేర్పారు ॥ఎ॥



అందాల నాట్యాల నెమలిభామలకు
పురివిప్పి ఆడడం ఎవరు నేర్పారు ॥ఎ॥
పట్టుదలే పెట్టుబడిగ నిలిచిగెలిచేటి
సాలీడు కెవ్వరు కలనేత నేర్పారు ॥ఎ॥
భువనాన అందాల గూడు గట్టేటి
గిజికాని కెవ్వడూ అల్ల నేర్పారు ॥ఎ॥
చిన్నారి పొన్నారి మన చిట్టిపాపలకు
నవ్వుల పువ్వులు ఎవరు అద్దారు ॥ఎ॥

## సోపానం

గడియారం గడియారం
గంటలుకొట్టే గడియారం
పదపదమని ప్రతిక్షణం
నడిపించే గడియారం
నిద్దర వద్దని అణుక్షణం
పరుగులు పెట్టిస్తుంది
ఉదయాన్నే మేలుకొలిపి
కొక్కొరకో అని కూస్తుంది
ఆ రోజుల్లో ఆకాశం
ఈ రోజుల్లో గడియారం
అయ్యిందీ కొలమానం
కాలగణనకు ప్రమాణం.



పుస్తక సమీక్ష

# 'చిటపట చినుకులు' కురిపించిన సంధ్య



వడ్డేపల్లి సంధ్య 'చిటపట చినుకులు' కురిపించింది. తన పాటలతో బాలలను మురిపించింది. తేలికైన పదాలలో, చిన్న వాక్యాలలో మంచి భావాలనందించింది. అనేక కవితలలో సృజనాత్మకతను చిందించింది.

"అమ్మంటే మమకారపు మహాకావ్యము...
నాన్నంటే దారిచూపు దీపస్తంభము"

అమ్మా నాన్నల గొప్పతనాన్ని అందంగా వర్ణించింది.

"అమ్మచేతి కమ్మనైన పాలబువ్వ తెలుగు...
ఈ తెలుగు, ఈ వెలుగు వేల యేండ్ల మన జిలుగు"

కవయిత్రికి తెలుగు భాషంటే మక్కువ. తెలుగును కాపాడుకోవాలనే తపన ఆమెలో ఎక్కువ.

చెట్టు – పలకగా, గిలకగా, బొమ్మగా, బ్యాటుగా, కుదురుగా, నాగలిగా, ఎన్నో వృత్తుల పనిముట్టుగా, ప్రాణ వాయువుగా – వివిధ రూపాలలో మన వికాసానికి వినియోగపడుతున్న విధమును అవగతం చేసింది.

కష్టమైన పనినైనా ఇష్టంగా చేయడం, పెద్ద బరువునైనా ప్రేమతో మోయడం చీమల లక్షణం.

"సోమరితన మెరుగక పనిలో ముందుంటాయి
చదువుకున్న మనకన్నా సఖ్యతగా మెదలుతాయి"

అని చీమల శ్రమశక్తి, క్రమశిక్షణ, సఖ్యత– మనుషులందరూ అలవరచుకోవాలని చెప్పకనే చెప్పింది.

'చిటపట చినుకులు' అనే కవిత చిటపట, టపటప, పదపద, బిరబిర, జలజల, గలగల వంటి అనుకరణ శబ్దాలతో అందంగా అమరింది. మబ్బులు నవ్వినాయని, నీటి ధారలు నేలను ముద్దాడినాయని, పచ్చపచ్చగ 'నేల పండుగ'లా విరిసిందని అనడంలో కవిత్వం గుబాళిస్తుంది. వానలు కురిస్తే, చెరువులు నిండితే, కాల్వలు పారితే, పొలాలు చేలు మురిస్తే

"పచ్చదనానికి జలహారం – భూమి తల్లికి సింగారం".

వడ్డేపల్లి సంధ్య ఉపాధ్యాయిని. బడి పిల్లలతో ఆమె అనుబంధాలు, ఆలోచనలు ఇందులో ప్రతిఫలిస్తాయి.

"అమ్మతనపు లాలన / నాన్న ప్రేమ పాలన
గురువుల రూపాన / మన కందును ఇక్కడే"

ఎంత గొప్పవాళ్ళైనా తొలి అడుగు వేసేది 'తరగతి గది'లోనే. భవిష్యత్తు భవనాలకు పునాదులు ఇక్కడే. ఆమె దృష్టిలో – బడి "శక్తులుగా తీర్చిదిద్దే చదువులమ్మ క్షేత్రం".

బడి పిల్లలు ఎగిరే పతంగులు. రంగుల హరివిల్లులు. ఎగురుతూ, దుంకుతూ, అల్లరి చేస్తూ, ఆడుతూ పాడుతూనే చదువులన్నీ చదువుతారు. అంతేకాదు, 'చదువుతూ పని నేర్వాలన్న గాంధీ మాట' పాటిస్తారు. పిల్లలకు బడిలో ఉన్నప్పుడే పని విలువ తెలియాలి. చిన్నప్పుడే పని విలువ తెలిస్తే, పెద్దయ్యాక సోమరులుగా మారరు అనేది రచయిత్రి భావన. "బాధ్యత నెరిగిన వాళ్లం – రేపటి వెలుగుల దివ్వెలం" అని అనుకునే విధంగా వారిని తీర్చిదిద్దాలి.

ఈ సంపుటిలో స్వచ్ఛభారత్‌కూ సముచిత స్థానం ఉంది.

"స్వచ్ఛమైన మన భారతావనికి
సరి లేదంటూ చాటి చెబుతాం"

భారతావని పట్ల చిన్నప్పటి నుంచే అందరికీ అంత ప్రేమ ఉండాలి.

"పరిశుభ్రత పాటిస్తే / ఆరోగ్యం మనదే / చెత్తను తొలగించేస్తే / స్వర్గసీమ మనదే"

పరిసరాలు మాత్రమే కాదు. మనుషుల మనసులూ స్వచ్ఛంగా ఉంటే భరతభూమి స్వర్గసీమ కాదా! కోకిలమ్మ గానం, నెమలిభామ నాట్యం, సాలీడు కలనేత, గిజిగాని అల్లికలాగా మనం ఏ పని చేసినా సహజసిద్ధంగా, సృజనాత్మకంగా ఉండాలి.



"చిన్నార పొన్నారి మన చిట్టి పాపలకు
నవ్వుల పువ్వులు ఎవరు అద్దారు?"

చిట్టి పాపల నవ్వుల పువ్వులలో ఎంతటి స్వచ్ఛత ! పెద్దవాళ్లు కూడ అంతటి స్వచ్ఛతతో ఉంటే జీవితాలకు ఎంతటి ధన్యత !

'ఏమేమి' శీర్షికన ఉన్న కవిత – ప్రతి రెండు పాదాలలో ఒక ప్రశ్న, ఒక జవాబు. పిల్లలను పాడేలా చేస్తుంది. పాడుతూ ఆడేలా చేస్తుంది. 'గాంధీ తాత' గేయం 'బలే తాత మన బాపూజీ' అనే సినిమా పాటను గుర్తు చేస్తుంది. సర్కారు బడి, బడిబాట గేయాలు ప్రభుత్వ బడులకు ప్రచార గీతాలుగా పనికి వస్తాయి.

వెన్నెల్లో ఒళ్లో బజ్జో పెట్టుకొని తాత చెప్పే కబుర్లు, కథలు వింటూ నిదురలోకి జారుకునే అనుభూతి, బతుకమ్మ పండుగకు తెలంగాణ పుల కింత, బోనాల విన్యాసాలు, సంక్రాంతి సంబరాలు, అన్నదాతల ఔన్నత్యం, గడియారాల నయగారాలు – ఈ కవితలలో కనిపిస్తాయి.

ఇందులోని కవితలే కాదు – ఆ కవితలకు వేసిన బొమ్మలు కూడ సహజ సుందరంగా, భావ బంధురంగా ఉన్నాయి. వడ్డేపల్లి సంధ్యకు అభినందనలు. ఈ కవయిత్రి ఇంకెన్నో కావ్యాలు రాయాలి. తెలుగు కవితా సరస్వతి మెడలో మరెన్నో బాల గేయాల మాలలను వేయాలి.

ప్రతులకు: వడ్డేపల్లి సంధ్య
10-1-17జి, శ్రీహరినగర్
రాంనగర్, కరీంనగర్-505 001
సెల్: 9848082822



**- ఎ. గజేందర్ రెడ్డి**
9848894086

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74,
జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.



# ప్రేమ - పెళ్లి

## కాలాతీతంగా సాగే జీవనది



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

**స్త్రీ పురుషుల మధ్య స్నేహం, ఆకర్షణ, ప్రేమ సహజమైనవి. సహజాత మైనవి. ప్రకృతిలో, జంతుజాలంలో, పశుపక్ష్యాదుల్లో కూడా ప్రేమ ఒక సహజాతం.**

ప్రేమ, స్నేహం చరిత్ర పూర్వకాల నుండి, జ్ఞానం, జ్ఞాపకం, వివేచన, వివేకం, సామాజిక నిర్మాణం ఏర్పడక ముందునుండి కొనసాగుతూ వస్తున్నాయి.

స్త్రీ పురుషుల మధ్య స్నేహం, ఆకర్షణ, ప్రేమ సహజమైనవి. సహజాత మైనవి. ప్రకృతిలో జంతుజాలంలో, పశుపక్ష్యాదుల్లో కూడా ఇవి చరిత్ర పూర్వకాల నుండి, జ్ఞానం, జ్ఞాపకం, వివేచన, వివేకం, సామాజిక నిర్మాణం ఏర్పడక ముందునుండి కొనసాగుతూ వస్తున్నది. కాలక్రమంలో బంధాలు, అనుబంధాలు, వావివరుసలు, సంబంధాలు, కట్టుబాట్లు, వర్ణం, కులం, వర్గం, భాష, సంస్కృతి, పరిధులు, పరిమితులు ఏర్పడుతూ వచ్చాయి. ఎన్ని పరిమితులు, పరిధులు ఏర్పడినప్పటికీ వాటన్నిటినీ అధిగమించి స్త్రీ పురుషుల ఆకర్షణ, స్నేహం, ప్రేమ ప్రతి తరంలో కొనసాగుతూ వస్తున్నది.

## కుటుంబ వ్యవస్థ కోసం పెళ్లి

కుటుంబ వ్యవస్థకోసం ప్రేమ, పెళ్లి అనే నిర్మాణం రూపంలో స్థిరపడుతున్నది. ఆయాకాలాల్లో సమాజ నిర్మాణ పద్ధతులను, సంప్రదాయ నిబంధన లను కాదని ముందుకు సాగిన ప్రేమలు కొన్ని విషాదాంత మయ్యాయి. కొన్ని సుఖాంతమై మానవాళికి ఆదర్శంగా నిలిచాయి. నూతన సంప్రదాయా లను, నూతన సంస్కృతిని నెలకొల్పాయి. ఇలా ప్రేమ, స్నేహం, ఆకర్షణ నిత్య చైతన్యవంతమైనది. నిత్య నూతనమైనది. జీవజాల పరిణామానికి, సహజీవనానికి అవసరమైనది. అనివార్యమైనది. ప్రేమ, ఆకర్షణ, సహజాతాలు లేని జీవితం నిస్సారమైనది. సమాజానికి జీవితాన్ని అంకితం చేసేవారు సమాజాన్ని ప్రేమిస్తారు. మానవాళి పట్ల ప్రేమను సహజాతంగా మలుచుకుంటారు. సన్యాసులు సమాజాన్ని ప్రేమించవచ్చు. తమను తాము, తమ భావాలను తాము ప్రేమించవచ్చు. పిల్లలు పుట్టడం ద్వారా స్త్రీ పురుషులు, భార్యాభర్తలు, దంపతులు, తల్లిదండ్రులవుతుంటారు.

## తల్లి జ్ఞాని, విజ్ఞాని, తొలి గురువు

తొలుత తల్లికే ఈ జ్ఞానం, విజ్ఞానం, వివేచన తెలుసు. కాలక్రమంలో సంతానం ఎలా కలుగుతుందో తెలుసుకోగలిగారు. తండ్రిని గుర్తించగలిగారు. మాతృస్వామిక వ్యవస్థలో మహిళలదే, తల్లులదే అధికారం. జ్ఞానం, విజ్ఞానం. సమాజాన్ని తల్లే ముందుకు నడిపించింది. మూడు తరాల పిల్లలతో మాతృస్వామిక వ్యవస్థ గుంపు సమాజంగా ప్రారంభమై క్రమంగా పురుషాధిపత్య, పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. పితృస్వామిక వ్యవస్థ ఏర్పడడంతో మగవారి ఆధిపత్యం పెరిగింది. కాలగమనంలో యుద్ధాల్లో, దండయాత్రల్లో స్త్రీలను చెరబట్టారు. గెలుచుకున్నారు. మలుచుకున్నారు. అనేకమంది స్త్రీలతో కాపురం చేశారు. అందులో ఒకరిని 'ధర్మపత్ని'గా ధృవీకరించారు. పాతివ్రత్యం అనగా, ఒక పతితో మాత్రమే మనసా, వాచా, కర్మేణ జీవితమంతా కలిసి ఉండాలని, కలిసి సాగాలని సంప్రదాయాన్ని నెలకొల్పారు. కాలగమనంలో సంఘర్షణలు పెరిగి, బలవంతుల నుండి బలహీనులకు రక్షణ కోసం దంపతీ వ్యవస్థ ఒక స్త్రీకి ఒక పురుషుడు, ఒక భార్యాభర్తల జంట అంటూ ఏర్పడుతూ వచ్చింది. ఈ పరిణామాలన్నీ దేశాలకు, ప్రాంతాలకు, భాషలకు, మతాలకు అతీతంగా అన్నిటా సుమారుగా ఒకే తీరుగా పరిణామం చెందుతూ వచ్చాయి.

## గడిచివచ్చిన దశలు

జానపద కథల్లో, కళల్లో, పురాణాల్లో, ఇతిహాసాల్లో, స్త్రీ పురుషుల ఆకర్షణ అనేక రూపాల్లో, అనేక సందర్భాల్లో వ్యక్తం చేబడ్డాయి. వేదాల్లో 'యమాయమి సంవాదం' గమనించవచ్చు. సారంగధర కథలో కూడా ఈ సంవాదం గమనించవచ్చు. 'మనుస్మృతి'లో స్త్రీ పురుషుల మధ్య సంబంధాలకు అనేక విధివిధానాలు, విధినిషేధాలు పేర్కొనబడ్డాయి.

బలవంతులు, గణతెగల నాయకులు, రాజులు, చక్రవర్తులు, అనేకమంది మహిళలను పెళ్లి చేసుకున్నారు. లేదా లైంగిక సంబంధాలు పెట్టుకున్నారు. వాటిని సమాజం అంగీకరించాల్సి వచ్చినపుడు. రసికత పేరిట ఆమోదించారు. శృంగార పురుషుడని ప్రశంసించారు. నచ్చనప్పుడు వ్యభిచారి, తిరుగుబోతు, విలువలు లేనివారు అని వర్ణించేవారు. శాంతియుత సహజీవనానికి ఒక స్త్రీ ఒక పురుషుడు కలిసి ఉండే దంపతీ వ్యవస్థ రూపుదిద్దుకుంటూ రావడం జరిగింది. గతంలో సామూహిక వివాహాలు వేరే అర్థంలో కొనసాగేవని, ఉదాహరణకు ఇల్లాలు, తోడుపిల్ల, తోడు పిల్లగాడు వంటి పదాల ద్వారా గమనించవచ్చు. ద్రౌపది ఐదుగురు భర్తలతో కాపురం చేయడం సుప్రసిద్ధం. కుంతీ నలుగురితో పిల్లల్ని కనడం తెలిసిన విషయమే. వారి పూర్వీకురాలైన మాధవి అనేకమందికి అప్పగించబడి కాపురం చేసి, విసిగిపోయిన విషయం మహాభారత కథల్లో పూర్వాశ్రమంలో ఉంటుంది. తారాచంద్రుల కథ కూడా ఒకటి సుప్రసిద్ధం. గురుపత్ని శిష్యుల మధ్య ప్రేమ గురించి గురువు, గురువు శిష్యురాలిపట్ల ప్రేమ గురించి అనేక ప్రాచీన కథలు ఉన్నాయి. అవన్నీ పాత కథలు. అయినా ఎక్కడో ఒకటి, ఎప్పుడో ఒకటి తటస్థ పడుతూనే ఉన్నాయి. సినిమాల్లో కూడా ఇలాంటివి దృశ్యీకరించబడ్డాయి. కొందరు మెచ్చని సహజాత ప్రేమల్లో కొనసాగుతున్నారని బలి తీసుకున్నారు. వారు విషాదాంత ప్రేమికులుగా మిగిలిపోయినప్పటికీ, తరతరాలుగా ప్రేమికులకు స్ఫూర్తినిస్తూ వస్తున్నారు. లైలా-మజ్ను, హీర్-రాంఝా మొదులుకొని శరత్‌బాబు రాసిన దేవదాసు నవల, సినిమా దాకా ఎన్నో గమనించవచ్చు.

## ప్రేమ ప్రారంభాలు

ప్రేమలు అనేక రకాలుగా మొదలవుతాయి. పెళ్ళిళ్ళుగా మారవచ్చు. మారకపోవచ్చు. స్నేహితులుగా మిగిలిపోవచ్చు. ద్వేషిస్తూ జీవించవచ్చు. అనివార్య స్థితుల్లో ఎవరికివారు మనసులో జీవితమంతా ఆరాధిస్తూనే ఉండవచ్చు. కొందరు మరిచిపోవచ్చు. ఆకర్షణ, వయస్సు బలీయమైనప్పుడు ప్రకృతి సాక్షిగా, పంచభూతాల సాక్షిగా కలిసిపోవచ్చు. దాన్ని గాంధర్వ వివాహం అన్నారు. ఎత్తుకుపోయి పెళ్లి చేసుకోవడం కూడా ఉంది. కృష్ణుడు రుక్మిణిని అలా పెళ్లి చేసుకున్నాడు. గెలిచి వారి భార్యగా, కూతురుగా పెళ్లి చేసుకున్నారు. జాంబవతిని కృష్ణుడు అలా పెళ్లి చేసుకున్నాడు. స్త్రీయే స్వయంగా కోరుకుని వరించినప్పుడు దానిని నేటికీ ఆదివాసీల్లో 'ఇల్లు చొచ్చుడు' అని పిలుస్తారు. సాహిత్య పరిభాషలో 'స్వయంవరం' అంటారు.

## స్వయంవరాలు

స్వయంవరం అనేది ఆదిమానవుల కాలంనుంచి కొనసాగుతూ వస్తున్నది. రాజ్యాలు ఏర్పడిన తర్వాత రాజు తన కూతురు పెళ్లికి ఇతర రాజ్యాల రాకుమారులను, యోధులను స్వయంవరానికి ఆహ్వానించేవారు. వారి గురించిన బయోడేటా రాజకుమార్తెకు మొదటే వివరించేవారు. అలా వారి గుణగణాలు, శౌర్యం, వీరం గురించి ముందే తెలుసుకున్న రాజ కుమార్తె అందులో ఒక్కరిని పూలదండతో స్వయంవరంలో వరించేది. భారతదేశానికి ఈ పేరు రావడానికి మూల కారకుడైన భరతుడు. దుష్యంతుడు వేటకు వెళ్ళి ఒక అమ్మాయిని చూసి ప్రేమించి, మోహించి ప్రకృతి సాక్షిగా పెళ్లి చేసుకుంటున్నాను అని చెప్పి శకుంతలను గాంధర్వ వివాహం చేసుకున్న సందర్భంగా జన్మించిన సంతానమే భరతుడు. శకుంతల కూడా ఎలా జన్మించింది? విశ్వామిత్రుని తపస్సును భగ్నం చేయడానికి ఇంద్రుడు పంపిన దేవకన్య మేనకను మోహించిన కారణంగా విశ్వామిత్రుడికి మేనకకు కలిగిన సంతానమే శకుంతల. ముని ఆశ్రమంలో పెరిగిన శకుంతల దుష్యంతుని కంటబడింది. అలా జరిగిపోయింది.

## కులాతీత, వర్ణాతీత ప్రేమలు

ఒకనాడు కులాలకు అతీతంగా, వర్ణాలకు అతీతంగా ప్రేమలు, పెళ్ళిళ్ళు కొనసాగేవి. ఇందుకు శకుంతల దుష్యంతుల ఉదంతం చక్కని ఉదాహరణ. అరుంధతి మాదిగ, మాతంగ కన్య అయినప్పటికీ బ్రాహ్మణుడైన వశిష్ఠుడు పెళ్లి చేసుకున్నాడని పురాణాలు చెప్తుంటాయి. నేటికీ పెళ్ళిలో అరుంధతి నక్షత్రం చూపించడం ఒక ఆదర్శ వివాహానికి ప్రతీక. భీష్ముడు ఒక బెస్తకన్యకు పుట్టినవాడని ప్రతీతియుడయ్యాడు. జి.వై. గిరి అనే సుప్రసిద్ధ రచయిత ఎవరిదీ ఎక్కువ కులమూ, ఎవరిదీ తక్కువ కులమూ అంటూ గొప్ప పాట రాశారు. అది సినిమాలో కూడా వచ్చి ప్రాచుర్యం పొందింది. మన పురాణాల్లో ఎన్ని రకాల పెళ్ళిళ్ళు, ఎన్ని కులాంతర వివాహాలు, ఎన్ని వర్ణాంతరాల వివాహాలు జరిగాయో చక్కగా పేర్కొన్నారు.

అదే క్రమంలో విశ్వామిత్రుడు ఒక దశలో కులాంతర వివాహాలు, వర్ణాంతర వివాహాలు జరగాలని కోరుకొని మాతంగ కన్యలను పెళ్లి చేసుకొమ్మని హరిశ్చంద్రుడిని కోరాడు. అప్పటికే ఆర్య త్రైవర్ణిక అనే వర్ణ విభజన స్థిరపడిందేమో మాతంగ కన్యలను పెళ్లి చేసుకోవడానికి నిరాక రించి అందుకు ప్రతిఫలంగా ఎంతైనా ధనధాన్యాలు ఇస్తానని అంటాడు. అలా విశ్వామిత్రుడికి అవి ఇవ్వడానికి సర్వస్వం కోల్పోయి కాటికాపరిగా వీరబాహు వద్ద చేరతాడు. వీరబాహు ఒక మాతంగ మహారాజు. మిగతా కథ తెలిసిందే. వర్ణాంతర వివాహాలను నిరాకరించిన హరిశ్చంద్రుడిని వర్ణాంతర వివాహాలను నిషేధించిన వర్ణాలు అత్యున్నత సత్యహరిశ్చంద్రుడిగా కీర్తించాయి.

## మహాభారతంలో మాధవి

మహాభారతంలో 'మాధవి' అనే ఒక పాత్ర ఉంది. గురుదక్షిణ క్రింద పొందిన మాధవిని అనేకమంది దగ్గరికి ఆ ముని కాంట్రాక్ట్ పెళ్ళిలా ఇస్తాడు. ఆమె వారికి పిల్లల్ని కంటుంది. మళ్ళీ అక్కడ్నుంచి తీసుకొని మరొకరికి ఇస్తాడు. ఆమె జీవితం పట్ల రోసిపోయి, విషాదంతో జీవిస్తుంది. కన్నడ ప్రముఖ రచయిత 'అనుపమ నిరంజన' 'మాధవి' అనే గొప్ప నవలగా ఈ ఉదంతాన్ని చిత్రించింది. కురు పాండవుల పూర్వీకురాలు మాధవి. అర్జునుడు, భీముడు అందుకు అనేకమందిని పెళ్లి చేసుకున్న తీరు మనకు తెలుసు. అర్జునుడికి పుట్టిన బభ్రువాహనుడు మహాభారత యుద్ధానికి ముందు బలి ఇచ్చిన విషయం చాలామందికి తెలియదు. అల్లి రాణి అనే ప్రమీలార్జునీయం సినిమాగా కూడా వచ్చింది. భీముడు, ఘటోత్కచుడు, హిడింబి కథ కూడా యన్టీ రామారావుతో సినిమాగా కూడా వచ్చింది.

## జీవితంలో దశలు, ఫంక్షన్లు

నేడు మనిషి పుట్టుకముందు, తల్లి కడుపులో పడ్డప్పటినుండి, పుట్టిన తర్వాత నామకరణం, బారసాల, బాల్యం, కౌమారం, యవ్వనం, విద్యాభ్యాసం, వృత్తి నైపుణ్యం, ఉద్యోగం, పెళ్లిచూపులు, ప్రేమలు, ఎంగేజ్‌మెంట్, పూలు పండ్లు, పెండ్లి, రిసెప్షన్, ఆ తర్వాత హానీమూన్, కొత్త సంసారం, కొత్త జీవితం ప్రారంభించడం, కొత్త అవసరాల ఒకరినొకరు అర్థం చేసుకోవడం, అలకలు, ఆప్యాయతలు, ఐరుసిద్దాల, చుట్టాలు, మిత్రులను పరస్పరం గౌరవించుకోవడం, అత్తగారింటికి, తల్లిగారింటికి అటూ ఇటూ అనే అయిన పండుగల్లో, సందర్భాల్లో వెళ్ళి రావడం, నెల తప్పడం, సీమంతం, తొలి కాన్పుకు ఏడో నెలలో తల్లి గారింటికి వెళ్లడం, తల్లిగారింటివద్దే ప్రసూతి, నామకరణం, బారసాల జరపడం, కనీసం మూడో నెల దాకా అనగా ఆరోగ్యం బాలింతనుండి మామూలుగా స్థాయికి కుదుటపడేదాకా తల్లిగారింటిలోనే ఉండడం, ఆ తర్వాత అత్తగారింటికి, భర్తతో తిరిగి కొత్త కాపురానికి బయలుదేరడం, పిల్లలకు ఆయా వయస్సుల అనుసరించి అత్త, మామ, తాత, అమ్మ వంటి పదాలు పలుక నేర్పడం, అన్నప్రాసన, ఫస్ట్ బర్త్‌డే, అక్షరాభ్యాసం, నర్సరీ, కిండర్‌గార్డెన్, ప్రైమరీ స్కూలు, క్రమశిక్షణ, పరిశుభ్రత గురించి నేర్పడం వగైరా క్రమంలో పిల్లల్ని పెంచుతూ తల్లి ప్రపంచంలోనే ఉపాధ్యాయురాలిగా మన్ననలు అందు కుంటుంది. తన పాలతోపాటు, ఉగ్గుతోపాటు, ప్రేమను, వాత్సల్యాన్ని పిల్లలకు అందిస్తూ పెంచుతుంది. ఇవన్నీ జీవితంలో మామూలుగా జరిగేవే అని కొందరు అనుకుంటారు. కానీ, వాటివెనుక ఆదిమానవుల నుండి వచ్చిన క్రమం గురించి చాలా మందికి తెలియదు. వేల యేళ్ళ సమాజ పరిణామంలో ఈ సంస్కారం, సంస్కృతి సంప్రదాయాలు, ఆత్మీయతలు, రక్తసంబంధాల తీరుతెన్నులు, బంధుత్వాలు రూపొందుతూ స్థిరపడుతూ వచ్చాయి.

## ఓప్రా విన్‌ఫ్రే

ఓప్రా విన్‌ఫ్రే అనే అమెరికన్ ప్రపంచ ప్రఖ్యాత టీవీ యాంకర్ తన ప్రఖ్యాత గ్రంథంలో ప్రేమ గురించి, ప్రేమించడం ఎలా, భావాలు పంచు కోవడం ఎలా, డేటింగ్ ఎలా, పెళ్లి ఎలా, పెళ్లి ఖాయం ఎలా ఉండాలి, భిన్నాభిప్రాయాలను ఎలా పరస్పరం సామరస్య దృష్టితో పరిష్కరించు కోవాలి, అంతిమంగా ఇక కలిసి ఉండలేం అనుకున్నప్పుడు ఎలా స్నేహపూరితంగా విడిపోవాలి, విడాకులు తీసుకున్నాక రెండో పెళ్ళి కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తిరిగి ఎలా ప్రేమించి పెళ్లి చేసుకోవాలి, పిల్లల్ని ఎలా పెంచి పోషించాలి మొదలైన అంశాలను సోదాహరణంగా వివరించారు. అలా అనేక పెళ్ళిళ్ళు చేసుకున్న స్త్రీ పురుషుల గురించి రాశారు. జీవితంలో ఒకే పెళ్ళితో కలిసి ఎలా జీవిస్తున్నారో కొందరిని ఇంటర్వ్యూ చేసి పొందు పరిచారు. ఇలా యువతరానికి నిరాశ కలగకుండా ప్రతి దశలో నైతికంగా మీ వెంట ఉన్నాను అని ఒక అక్కలా, తల్లిలా అనేక విషయాలను వివరించిన తీరు మహెూన్నత మానవీయ సంస్కృతికి నిదర్శనం. అలాంటి సందర్భాల్లో భారతీయ మహిళలు ఎదుర్కొనే సమస్యలు, వాటిని పరిష్కరించుకోవాల్సిన తీరు గురించి సాక్షి దినపత్రికలో 'విలువలు' అనే కథను రాశాను. ఇలా ప్రేమలు, పెళ్ళిళ్ళు, కుటుంబాలు ఏర్పడడానికి వేల ఏళ్ళ చరిత్ర, సంస్కృతి, పరిణామాలు అంతర్లీనంగా కొనసాగుతూ వచ్చాయి.

## మళ్ళీ కలిసి జీవించడం

విడాకులయ్యాక కొంత కాలానికి స్వీయ సమీక్షలో కొన్ని విషయాలు తెలిసిరావచ్చు. తనను తాను సరిదిద్దుకోవాలని అనిపించవచ్చు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న న్యాయస్థానాలు విడాకులైనవారు తిరిగి కలిసి కాపురం చేసే అవకాశం ఉందని చెప్పడం జరిగింది. అలా విడిపోయి దూరమయ్యాక అవగాహణలో, ప్రవర్తనలో, సర్దుబాటుతత్వం పెంచుకొని తిరిగి కాపురం చేయడం కూడా ఆహ్వానించదగిన పరిణామం. అందుకు విడాకులయ్యాక కొంతకాలం మరో పెళ్ళి గురించి ఆలోచించకుండా, వేచి ఉండి సమీక్షించుకుంటే కోల్పోయిన జీవితం తిరిగి పొందవచ్చు. లేదా విడాకులు ఎంత సరియైన నిర్ణయమో తెలిసిరావచ్చు.

చాలా సినిమాలు ప్రేమ వివాహాలను ఆదర్శీకరించడం గమనించ వచ్చు. ప్రేమించి పెళ్ళి చేసుకోవడం, పెళ్ళి చేసుకొని ప్రేమించడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పొట్ట చేత పట్టుకొని ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు, నగరాలకు, ఇతర దేశాలకు వలస పోవడం వంటి పరిణామాల్లో మారుతున్న పెళ్ళి, ప్రేమలు, కుల వ్యవస్థ, అభివృద్ధి, విషాదాలు, వెలుగునీడలు గురించి నేను అనేక కథల్లో, నవలల్లో చిత్రించాను. 'చికాగోలో నానమ్మ', స్మృతి', 'వేపచెట్టు', 'బతుకుపయనం', 'గెలుచుకున్న జీవితం', 'స్వేచ్ఛనుండి విముక్తి', 'కాలం తెచ్చిన మార్పు', 'మమతలు, మానవ సంబంధాలు' వంటి కథా సంపుటాల్లో, 'బతుకుపోరు', 'జీవనయానం', 'చూపు' వంటి నవలల్లో అనేక కోణాల్లో ఈ తరం పెళ్ళిళ్ళు గురించి వాటి వైవిధ్యం, సహజీవనం, సంఘర్షణలు ప్రతిదాంట్లోని మంచి చెడులు విశ్లేషించడం జరిగింది. 'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం', 'శూద్రులు భారతీయ చరిత్ర నిర్మాతలు' అనే గ్రంథాల్లో పెళ్ళి, కుటుంబం పరిణామం చెందిన క్రమాలను విశ్లేషించాను. ఓపిక ఉన్నవారు వాటిని కూడా చదివితే మంచిది.

## కుటుంబ వ్యవస్థ, దంపతీ వ్యవస్థ

దంపతీ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, ఉమ్మడి కుటుంబం, వ్యక్తిగత కుటుంబం, సింగిల్ పేరెంట్ కుటుంబం అనేవి ఒక్కరోజులోనో, ఒక్క తరంలోనో రూపుదిద్దుకున్నవి కావు. ప్రపంచ వ్యాప్తంగా వేల సంవత్సరాల పరిణామ చరిత్రలో భాగంగా ఇవి ఏర్పడుతూ, స్థిరపడుతూ వచ్చాయి. మొదట ఆదిమ సమాజం కొండల్లో, కొండ గుహల్లో, అడవుల్లో, గుంపులు గుంపులుగా జీవించేవారు. ఆ జీవనం గురించి మానవ సమాజం గణతెగల సమాజంగా, జనపదాల, రాజన్యల సమాజంగా మారుతూ వచ్చింది. తల్లి కుదురుగా మొదట గణాలు ఏర్పడ్డాయి. బృందాలు ఏర్పడ్డాయి. దాన్ని మాతృస్వామిక వ్యవస్థ అని పిలువడం జరిగింది. తల్లే సర్వస్వం, తల్లే అన్నిటికీ అధికారి. ఈ దశలో ఆహార సేకరణ, వేట, పశుపోషణ సాగింది. ఆ తల్లి తాను పిల్లలు కంటున్న పద్ధతిలో ఈ ప్రకృతి కూడా పుట్టి పెరుగుతున్నదని గమనించింది. అలా విత్తనాలు మొలకెత్తడం చూసింది. అందుకే సింధు నాగరికతలో బయల్పడిన చిత్రాల్లో మాతృగర్భం నుండి మొక్క మొలకెత్తినట్టు చిత్రించిన చిత్రం బయల్పడింది. అదే ఆ తర్వాత స్వస్తిక్ గుర్తుగా రూపొందిందని అంటారు. అలా వ్యవసాయాన్ని కనుక్కున్న తర్వాత వ్యవసాయానికి స్థిరమైన జీవితం అవసరమైంది.

గుడిసెలు, కొండగుహలు, కాలువలు, వాగులు, నదుల వెంట స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతూ వచ్చింది. ఈ తరం దంపతీ వ్యవస్థ దాకా ఎదిగిన క్రమాన్ని రాహుల్ సాంకృత్యాయన్ అనే మహా రచయిత 140 భాషలు నేర్చుకున్నవాడు తన పరిశోధన ఫలితంగా 'వోల్గాసె గంగ' అనే కథల సంపుటి రూపంలో మానవ పరిణామ చరిత్రను మనముందుంచారు. డిడి కోశాంబి ప్రాచీన భారతీయ చరిత్రకు ఉపోద్ఘాతం పేరిట బృహత్ గ్రంథాన్ని రాశారు. అందులో కూడా తనదైన కోణంలో ఈ సమాజ పరిణామాన్ని విశ్లేషించారు. ఈనాడు దినపత్రిక సంపాదకులుగా పనిచేసిన సుప్రసిద్ధ రచయిత రాంభట్ల కృష్ణమూర్తి 'జనకథ' అనే గ్రంథంలో తాపీ ధర్మారావు వలె, ఆరుద్రవలె, వారు వెలికితెచ్చిన అంశాలను ఆసరా చేసుకొని, మరింత ముందుకు సాగి, అనేక విషయాలను మనముందుంచారు. మేనమామ అనే పదంలో మేన, మ్యాన అనే పదం ప్రపంచ భాషల్లో ఎలా కొనసాగుతూ వచ్చిందో పేర్కొన్నారు. రుగ్వేదంలో యమా యమి సంవాదం గమనించవచ్చు. యముడికి, యమికి గల సంవాదం ద్వారా పెళ్ళిళ్ళలో వచ్చిన మార్పులు గమనించవచ్చు. ఒకనాటి లైంగిక సంబంధాలు, రక్తసంబంధాలు, పెళ్ళి సంబంధాలు, మారుతూ మారుతూ మేనసంబంధాలుగా రూపొందిన క్రమాన్ని యమా యమి, మేన, మ్యాన, మేనమామ అనే అంశాల ద్వారా చాలా విషయాలు తెలుసుకోవచ్చు. కాలక్రమంలో మేన సంబంధాలు కూడా మంచివి కావు. మేన సంబంధాలు చేసుకుంటే ఏడు తరాల లోపాలు, వ్యాధులు తర్వాతి తరాలకు వస్తాయని మానవ సమాజం గిడసబారిపోతుందని, మానసిక, శారీరక వైకల్యాలతో జన్మిస్తారని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల కులాంతర, వర్ణాంతర, మతాంతర వివాహాలు మానవ సమాజ అభివృద్ధికి మానసిక, శారీరక వికాసానికి, సంస్కృతి సమ్మేళనాలకు, శాంతియుత పరివర్తనకు, సహజీవనానికి మహెూన్నతంగా ఉపకరిస్తాయని సామాజిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

మానవులు ఆదిమానవుల దశనుండి గణతెగల, జనపదాల దశల గుండా పరిణామం చెందుతూ రాజ్యాలు, రాజరికాలు, సామ్రాజ్యాలు విస్తరిస్తూ వచ్చాయి. క్రీ.పూ. నాటి గ్రీకు తత్వవేత్త ప్లేటో శిష్యుడు, జగజ్జేత అలెగ్జాండర్ గురువు అయిన అరిస్టాటిల్ పెళ్ళి, కుటుంబ వ్యవస్థ గురించి చక్కని నిర్వచనం ఇచ్చారు. ఇప్పటికీ ఆ నిర్వచనంలో పెద్దగా మార్పు చేయాల్సిన అవసరం లేదని అంటుంటారు. గణతెగల, జనపదాల, రాజ్యాల, ఆయా సమాజాల దశలను అనుసరించి కుటుంబం, పెళ్ళి, మానవ సంబంధాలు, ప్రేమలు నిర్ణయమవు తాయి. రాజ్యంయొక్క ఒక ప్రాథమిక యూనిట్‌గా కుటుంబ వ్యవస్థ కొనసాగు తుంది అని అరిస్టాటిల్ భావించాడు.

## పెళ్ళి పుట్టుపూర్వోత్తరాలు

పెళ్ళి, కుటుంబం వాటి పరిణామాల గురించి, ఆదిమానవుల, గణతెగల తొలి దశలనుండి సుప్రసిద్ధ సాహితీవేత్త, జర్నలిస్టు, మార్గదర్శకులు తాపీ ధర్మారావుగారు 'పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు', 'దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు?', 'ఇనుప కచ్చడాలు' మొదలైన అనేక గ్రంథాలు రాశారు. పెళ్ళి, కుటుంబం, ప్రేమల గురించి ఆదిమానవుల దశల గురించి 'మోర్గాన్' అనే మానవ శాస్త్రవేత్త, 'పురాతన సమాజం' (ఏన్సెంట్ సొసైటి) అనే బృహత్తర పరిశోధనా గ్రంథం వెలువరించారు. రెడ్ ఇండియన్స్, ఉత్తర, దక్షిణ అమెరికా, ప్రాచీన ఆది మానవులు తన కాలందాకా జీవించి ఉన్న వారి సంస్కృతి, జీవన విధానం, ప్రేమలు, పెళ్ళిళ్ళు, గణతెగల, జనపదాల గురించి పూస గుచ్చినట్టు అనేక వివరాలతో, విశేషాలతో ఆ గ్రంథాన్ని ప్రచురించారు. నేటికీ ఆ గ్రంథం ప్రపంచ వ్యాప్తంగా ప్రామాణిక గ్రంథంగా గుర్తింపబడుతున్నది. 'కమ్యూనిస్టు మ్యానిఫెస్టో' రాసిన మార్క్స్, ఎంగెల్స్‌లలో ఒకరైన ఎంగెల్స్ ఆ గ్రంథాన్ని చదివి, అధ్యయనం చేసి 'కుటుంబం - వ్యక్తిగత ఆస్థి - రాజ్యం - పుట్టుక' అనే సమీక్షా గ్రంథం వెలువరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ గ్రంథం ద్వారా మోర్గాన్ పరిశోధనలు, మరింత ప్రామాణికత సంతరించుకున్నాయి.

కమ్యూనిస్టులు, నూతన సమాజ నిర్మాణానికి నిన్న, నేడు, రేపు కుటుంబం, పెళ్ళి, వ్యక్తిగత ఆస్థి, రాజ్యం ఎలా ఉండేదో, ఎలా ఉందో, ఎలా ఉండబోతుందో, ఎలా ఉంటే బాగుంటుందో అనే అంశాలను 'కుటుంబం - వ్యక్తిగత ఆస్థి - రాజ్యం - పుట్టుక' అనే గ్రంథం మౌలిక ప్రాతిపదికగా తీసుకొని అనేక గ్రంథాల్లో, రచనల్లో విశ్లేషించారు. ఈ విశ్లేషణకి మూలాధారం తత్వవేత్త అరిస్టాటిల్ చేసిన నిర్వచనం ప్రాతిపదికగా కొనసాగడం అరిస్టాటిల్ ముందుచూపు ఎంత గొప్పదో తెలుపుతుంది.

భారతీయ సామాజిక పరిణామాలను, చరిత్రను గమనించినట్లయితే అది మరొక ప్రత్యేక పరిస్థితుల్లో కొనసాగాయి. ఆయా స్థల, కాల, నిర్దిష్ట, ప్రకృతి, మానవ సంబంధాల పరిణామంలో, వలసలు, వలవాదులు నిరంతరం ఒకచోటునుండి మరొక చోటుకు ప్రయాణాలు, స్థిర నివాసాలు ఏర్పర్చుకుంటూ వచ్చిన గణతెగలు, జనపదాలు, దాడులు, దండయాత్రలు, సంఘర్షణలు, యుద్ధాలు, రాజ్యాల ఏర్పాటు క్రమాలను అనుసరించి భారత ఉపఖండంలో కుటుంబం, ప్రేమ, పెళ్ళి, వ్యక్తిగత ఆస్థి, రాజ్యం, పుట్టుక, వర్ణ వ్యవస్థ, కాలక్రమంలో కుల వ్యవస్థ, కుల అంతరాలు, కుల వివక్ష, ఒకే వర్ణంలో పెళ్ళి, ఆ పరిణామంలో ఒకే కులంలో పెళ్ళి అనే రీతులు ఏర్పడుతూ వచ్చాయి.

బుద్ధుడు, జైన మహావీరుడుకు పూర్వం సింధూ నాగరికత, సరస్వతి నదీ నాగరికత, కృష్ణా, గోదావరి, కావేరి నదీ నాగరికతలు, నదీనదాల వెంట సాగిన మానవ ప్రస్థానాలు, స్థిర నివాసాలు కొనసాగాయి. అవి చరిత్ర ప్రసిద్ధం, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల ప్రాంతాల్లో గోదావరి ఒడ్డున గల కోటిలింగాల గ్రామం క్రీ.పూ. నాటి శాతవాహనుల రాజధానిగా దశాబ్దాల తరబడి కొనసాగుతూ వచ్చింది. ప్రపంచంలో కొండ గుహలనుండి, అడవుల నుండి సాగుతూ సాగుతూ పశుపోషణ, ఆహార సేకరణ దశల నుండి కాస్త స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ఎల్లప్పుడు నీరు అందుబాటులో ఉండే నదుల వెంట నాగరికతలు రూపొందుతూ వచ్చాయి. అలా ఇటలీ నైలునదీ నాగరికత, సింధు, గంగానది, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణా నది, తుంగభద్ర, కావేరి, నర్మద వంటి నదీనదాలు వెంట మానవుల స్థిర నివాసాలు ఏర్పడుతూ వచ్చాయి. నదుల్లో వరదలు వచ్చినప్పుడు అవి కొట్టుకుపోయాయి. తిరిగి నిర్మాణం చేసుకున్నారు. అలా నేటికీ నదీనదాల పరిసరాల్లోనే నాగరికతలు, నగరాలు, జనావాసాలు కొనసాగుతూ వస్తున్నాయి. విద్యుత్ కనుక్కొని నదుల నీరు నల్లాల ద్వారా పట్టణాలకు తరలించడానికి ముందు నదులుగానీ, చెరువులు గానీ, సరస్సులు గానీ ఉన్న పరిసరాల్లోనే జనావాసాలు ఏర్పడుతూ వచ్చాయి.

వాన నీటిని నిలువచేసుకోవచ్చని కనుక్కున్న మానవులు కాలువలకు, వాగులకు, చిన్న నదులకు ఆనకట్టలు నిర్మించారు. అలా చెరువులు రూపొందాయి. చెరువు ఆ ఊరి అనేక అవసరాలకు కేంద్రంగా కొనసాగుతూ వచ్చింది. చెరువు ద్వారా మంచినీరు, వ్యవసాయానికి నీరు, స్నానాలకు నీరు, బట్టలు ఉతకడానికి నీరు, పశువులకు, చేపలకు మొదలైన అనేక అవసరాలకు చెరువు ఒక కేంద్ర బిందువైంది. చెరువుకు వెళ్ళి కుండలో, బిందెలో నీరు తెచ్చుకోవడం, బట్టలు ఉతుక్కోవడం అనే పనుల ద్వారా చెరువు ఆ ఊరి దినపత్రికగా కొనసాగిందని మహా రచయిత ప్రేమ్‌చంద్ గత శతాబ్దంలో పేర్కొన్నారు.

మన దేశంలో ముఖ్యంగా దక్కన్ పీఠభూమిలో కొండలు, గుట్టలు, మిట్టపల్లాలు కారణంగా చెరువులు కట్టుకోవడం, నీరు నిలువచేసుకోవడం ఎంతో అవసరమైంది. ఎంతో సులువైంది కూడా. అలా ఇప్పటికీ ప్రతి ఊరికి ఒక చెరువు, ఒకటి రెండు కుంటలు ఉండడాన్ని గమనించవచ్చు.

సింధూ నాగరికత అని పిలువబడే అనేక ప్రాచీన నాగరికతలు, చరిత్రలు, సంస్కృతులు పరిశోధనలో వెలికి వచ్చాయి. వాటినుంచి మానవ చరిత్ర, సంస్కృతి, ప్రేమలు, పెళ్ళిళ్ళు, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, వర్ణ సంబంధాలు, కుల సంబంధాలు, కులవృత్తులు, కుల సంస్కృతి, కులాల మధ్య అంతరాలు, కులాలమధ్య పెళ్ళిళ్ళ నిషేధాలు, వర్ణాల మధ్య పెళ్ళిళ్ళ నిషేధాలు ఎలా కొనసాగుతూ వచ్చాయో 'మనుధర్మ శాస్త్రం', 'నారద స్మృతి', 'యాజ్ఞవల్క స్మృతి' వంటి అనేక గ్రంథాలు పేర్కొన్నాయి. ఆ నిషేధాలు పాటించకపోతే కఠినమైన శిక్షలు ఎలా ఉండాలో కూడా రాజులకు సూచించి వీలైన మేరకు వాటిని రాజులచేత అమలు జరిపించారు. వీటిని సంప్రదాయ వివాహాలు అని పిలిచారు. సంప్రదాయ వివాహ పద్ధతుల గురించి సింహప్రసాద్ ఒక చక్కటి గ్రంథంలో వివరించారు.

కాలగతిలో కేవలం ఆయా వర్ణంలోనే పెళ్ళి, ఆయా కులంలోనే పెళ్ళి అనేవి స్థిరపడుతూ వచ్చాయి. ఇలా 'ఈ తరం పెళ్ళి' రూపుదిద్దుకోవడం వెనుక వేల సంవత్సరాల చరిత్ర పరిణామం ఉంది. ఈ చరిత్ర పరిణామంలో నేటి కులాలవారీ పెళ్ళిళ్ళలో కులాలవారీగా పెళ్ళి పద్ధతులు, పెళ్ళి సంస్కృతి కొనసాగుతూ వస్తున్నది. ప్రతి కులానికి, ప్రాంతానికి తనదైన పెళ్ళి పద్ధతి, విధానం ప్రత్యేకంగా గమనించవచ్చు. పెళ్ళిలో కొనసాగే సంస్కృతి, పద్ధతులు, విధానాలు గమనిస్తే గడిచివచ్చిన పెళ్ళి దశల ఆనవాళ్ళు అనేకం కనిపిస్తాయి. ప్రస్తుత సంప్రదాయిక హిందూ వివాహ తంతులు 13కు పైగా వివాహ పద్దతుల ఆనవాళ్ళు తంతు రూపంలో కొనసాగడం గమనించవచ్చు.

తోడు పెళ్ళి పిల్లగాడు, తోడు పెళ్ళి పిల్ల అనేవి ఒకనాటి పెళ్ళి అవశేషాలను తెలుపుతాయి. ఇల్లాలు అనే పదం ఒకనాటి పెళ్ళి, కుటుంబ వ్యవస్థయొక్క అవశేషాలను తెలుపుతుంది. 25-30 ఏళ్ళ క్రితం స్టేజి మ్యారేజ్ సందర్భంగా అనేక ప్రసంగాలు చేయాల్సి వచ్చింది. ఆ సందర్భంగా గత కాలంనుండి కొనసాగుతున్న ఈ తరం పెళ్ళిళ్ళ తీరుతెన్నులను, వాటి వెనుకగల చారిత్రక పరిణామాలను విశ్లేషించాల్సి వచ్చింది. నాకు తెలిసి ప్రస్తుత సాంప్రదాయిక పెళ్ళిళ్ళలో సుమారు పదమూడు రకాల పెళ్ళిళ్ళు, వాటి విధివిధానాలు ఒకే పెళ్ళి తంతుగా పెనవేసుకొని కొనసాగుతున్నాయి. కాలు తొక్కితే ఒక పెళ్ళి, ఎంగిలి తింటే ఒక పెళ్ళి, ఏడడుగులు కలిసి నడిస్తే ఒక పెళ్ళి, ఇచ్చిన చీర కట్టుకుంటే ఒక పెళ్ళి, అరుంధతి నక్షత్రం చూస్తే ఒక పెళ్ళి, బావమరుదులు పెళ్ళి పిల్లను, పిల్లగాడ్ని అడ్డగించడం ఒక పెళ్ళి, జిలకర బెల్లం తలమీద పెట్టడం

(మిగతా 7వ పేజీలో...)

